క్లుప్తంగా

పందిని ఢీకొన్న బైకు.. ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన యువకుడు

పెద్దదోర్నాల: ప్రయాణిస్తున్న మోటారు సైకిల్‌ను అడవి పంది ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలోని ముస్లిం శ్మశాన వాటిక సమీపంలో శుక్రవారం జరిగింది. ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న మండల కేంద్రానికి చెందిన నబీరసూల్, పోలయ్యలకు గాయాలయ్యాయి. సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. మార్కాపురం వైపు నుంచి మండల కేంద్రానికి మోటారు సైకిల్‌పై వస్తున్న వీరి వాహనాన్ని పంది ఢీకొనటంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను స్థానికులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏసయ్య ఆశీర్వాద పండగలు


దైవ సందేశం ఇస్తున్న పాస్టర్లు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని జీసస్ హీలింగ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏసయ్య ఆశీర్వాద పండగలు రెండు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకులుగా నంద్యాల హోసన్నా మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ అనిల్, ఒంగోలుకు చెందిన షాలేం మినిస్ట్రీస్ పాస్టర్ రాజేంద్రన్ పాల్గొని దైవ సందేశం వినిపించారు. జీసస్ హీలింగ్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ ఏసన్నతో పాటు మండలానికి చెందిన పలువురు పాస్టర్‌లు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పుల్లలచెరువు: సివిల్ రైట్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ పాలెంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ పాలెం ప్రజలను ఉద్దేశించి తహసీల్దార్ మాట్లాడుతూ దళితులపై అంటరానితనం, కుల వివక్ష వంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీనియర్ సహాయకులు పురుషోత్తంరెడ్డి, వీఆర్వో వసుంధర, కానిస్టేబుల్ చంద్రకళ, దళిత కాలనీ వాసులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఆధారంగా వ్యవసాయం చేయాలి


మట్టిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

తాళ్లూరు: మట్టి పరీక్ష ఫలితాల ఆధారంగా రైతులు వ్యవసాయం చేయాలని, యాజమాన్య పద్ధతులు పాటించాలని, సేంద్రియ ఎరువులు అధికంగా వాడి నేల సారవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో శుక్రవారం 2025–26 సంవత్సరానికి నిర్దేశించి రైతులు పండించే భూమి నుంచి సేకరించిన మట్టిని భూసార పరీక్ష కేంద్రం ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. మండలం మొత్తం 804 మట్టి శాంపిళ్లు సేకరించాలని సిబ్బందికి సూచించారు. మట్టి పరీక్ష అనంతరం ఫలితాలను రైతులకు కార్డులు ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఏఈఓ రాజసుందరి, వీఏఏలు సుధీర్, దయాసాగర్ పాల్గొన్నారు.

ఆక్రమిత చెరువు భూమి పరిశీలన

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల ఎంఐ ట్యాంక్ చెరువు పరిధిలో ఆక్రమణకు గురైన భూమిని ఇరిగేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. పామూరుపల్లె గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గిద్దలూరు ఇరిగేషన్ డీఈ రామారావు తమ సిబ్బందితో కలిసి రెడ్డిచెర్ల చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. కొంతమంది వ్యక్తులు చెరువులో పొలం సాగు చేస్తున్నట్లుగా స్థానికుల ద్వారా గుర్తించిన అధికారులు ఆ పొలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరిగేషన్ ఏఈలకు సూచించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి రెడ్డిచెర్ల చెరువు హద్దులు సర్వే చేయాలని చెప్పారు. చెరువు అంతర్భాగంలో ఎవరూ పంటలు సాగు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట కొమరోలు, గిద్దలూరు ఏఈలు సుధాకర్, వెంకటరామిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ ఉన్నారు.





ప్రమాదకరంగా అన్నసముద్రం రోడ్డు


ప్రమాదకరంగా రోడ్డు


గుంతలమయమైన రోడ్డు

త్రిపురాంతకం: మండలంలోని అన్నసముద్రం రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. రోడ్డు పూర్తిగా గుంతల మయమై కంకరు లేచి అధ్వానంగా తయారైంది. ప్రయాణం చేసే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణానికి పలు పర్యాయాలు విన్నవించినా పట్టించుకునే వారు లేరన్న విమర్శలు వినవస్తున్నాయి. నేషనల్ హైవే నుంచి పాత అన్నసముద్రం వరకు ఉన్న తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఐదు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుపై ప్రయాణం చేస్తారు. ఈ గ్రామాల నుంచి నేషనల్ హైవే వరకు ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారు. అలాంటి రోడ్డు పాడైపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. వ్యవసాయ భూములకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుమందులు వంటివి పొలాలకు చేర్చుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. పండించిన పంటలు ఇంటికి చేరాలన్నా, మార్కెట్‌కు తరలించాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. కొత్త అన్నసముద్రంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు వైద్యం కోసం వెళ్లే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ వైద్యశాల పరిధిలో సుమారు పది గ్రామాలు ఉన్నాయి. వైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లేందుకు, పీహెచ్‌సీకి చేరేందుకు ఈ రోడ్డుపైనే ప్రయాణం చేయాల్సి ఉంది. రోడ్డు అధ్వానంగా ఉన్నందున ప్రజలు ఇబ్బందులు పడుతూనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల రవాణ అవసరాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న బూచేపల్లి

● ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ముండ్లమూరు (కురిచేడు): ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు అభివృద్ధి చెంది ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. ముండ్లమూరు మండలం వేంపాడులో శుక్రవారం జరిగిన శ్రీ సీతారామస్వామి గుడి జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారిని రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించారు. ఆ దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చింతా శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, జెడ్పీటీసీ తాతపూడి రతన్‌రాజు, చిరంజీవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ పంచాయతీలుగా సంగాపురం, వద్దిపాడు


అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వర్లు


సరోజా వెంకటరెడ్డి..

దొనకొండ: మండలంలోని సంగాపురం, వద్దిపాడు పంచాయతీలు టీబీ ముక్త్ పంచాయతీలుగా ఎన్నికయ్యాయి. ఈ రెండు పంచాయతీల్లో వైద్యపరంగా టీబీ కేసులు లేనట్లు వైద్యులు ప్రకటించారు. శుక్రవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్‌లు భీమిని వెంకటేశ్వర్లు, నూనె సరోజ వెంకటరెడ్డిలకు ఉత్తమ అవార్డులు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అందజేశారు. ఈ రెండు పంచాయతీలను ఉదాహరణగా తీసుకుని మిగిలిన పంచాయతీలు నడుచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

కౌలురైతు పత్రాల జారీపై అవగాహన

దొనకొండ: గ్రామాల్లో పొలం లేని రైతులు, తక్కువ పొలం ఉండి ఇతర పెద్ద రైతుల వద్ద పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని తహసీల్దార్ ఎస్.శ్రావణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సిబ్బందికి మరియు రెవెన్యూ అధికారులకు సంయుక్తంగా నిర్వహించిన కౌలు రైతులకు సీసీఆర్‌సీ మంజూరు చేసేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కౌలుకార్డుల కోసం భూ యజమాని ఆధార్‌కార్డు, పొలం 1బీ, రైతు ఆధార్ నకలు పత్రాలు తీసుకుని సంబంధిత సచివాలయంలోని గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు. ఈ ఏడాది మండలానికి 902 కౌలు కార్డులు ఇవ్వాలనే లక్ష్యాన్ని జిల్లా ఉన్నతాధికారులు నిర్దేశించినట్లు తెలిపారు. భూయజమాని హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం కౌలుదారు హక్కు చట్టం 2019లో చేసిందని, కౌలుకు తీసుకున్న రైతుకు పంటపై మాత్రమే హక్కు కలిగి ఉంటాడని, పొలం మీద ఎలాంటి హక్కు ఉండదని, అమ్ముకునేందుకు హక్కు ఉండదని, దరఖాస్తు చేసిన మూడు రోజుల్లో కార్డులు మంజూరు చేస్తామని తహసీల్దార్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు పండిన పంట ఉత్పత్తులు కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు. బ్యాంక్‌ల ద్వారా రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మండలంలోని కౌలు రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం


తాళ్లూరు: యోగాసనాలు వేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు


యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

తాళ్లూరు: యోగా జీవన విధానంలో ఒక భాగం కావాలని ఎంపీడీఓ దార హనుమంతురావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం మండల సచివాలయాల సిబ్బంది, పలు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ సంజీవరావు, ఎంపీపీ టి.శ్రీనివాసరావు, ఆయుర్వేద డాక్టర్ శిరీష, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముండ్లమూరు (కురిచేడు): యోగాతో ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని ఎంపీడీఓ పి. సునీత తెలిపారు. ముండ్లమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం 70 మందికి యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం పెరిగి ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఎంత ఒత్తిడి ఉన్నా ప్రజలు క్రమం తప్పకుండా యోగా, వాకింగ్ చేయాలన్నారు. అనంతరం ఉద్యోగులు, ప్రజలతో యోగాసనాలు చేయించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఆర్. జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక హక్కులు పదిలం


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

పొదిలి: ప్రభుత్వాలు హరిస్తున్న కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు సీఐటీయూ నిత్యం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్మికుల మస్టర్ పాయింట్‌లో సంస్థ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసిందని పేర్కొన్నారు. 8 గంటల పని విధానానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు చేస్తున్న కార్పొరేట్ శక్తులను కార్మికులు సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నర సింహం, జి.నాగేశ్వరరావు, హనుమంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సీతారాముల గ్రామోత్సవం

రాచర్ల: మండలంలోని ఒద్దులవాగుపల్లె పంచాయతీ పరిధిలోని అచ్చంపల్లె గ్రామంలో సీతాలక్ష్మణ హనుమత్ సమేత పట్టాభిరామస్వామి నూతన విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా నూతన విగ్రహాల గ్రామోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం నూతన విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ, ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రి 7 గంటలకు గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బాలోత్సవం ప్రారంభం


బాలోత్సవంలో శిక్షణ ఇస్తున్న పెద్దలు

దర్శి (కురిచేడు): చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దర్శిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం బాలోత్సవం ఘనంగా ప్రారంభమైంది. విజ్ఞానం, వినోదం, మానసిక వికాసం లక్ష్యంగా 15 సంవత్సరాల బాల, బాలికలకు శిక్షణ ఇస్తున్నట్లు బాలోత్సవం రాష్ట్ర నాయకురాలు కంకణాల రమాదేవి పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగే బాలోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో పిల్లలకు అవసరమైన సామాజిక విజ్ఞానం, మానసిక వికాసం పెంపొందక చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురై ఆవేదనతో ఆత్మహత్యలు, కక్షలు పెరుగుతున్నాయన్నారు. సామాజిక చైతన్యం కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బాల బాలికలకు బాలోత్సవం పేరుతో పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతున్నట్లు రమాదేవి వివరించారు. ఝాన్సీ నర్సింగ్ హోమ్ డాక్టర్ బి.కోటిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం పిల్లల మానసిక వికాసానికి ఉపయోగపడుతుందని కోటిరెడ్డి అన్నారు. ప్రశ్నించడం నేర్చుకున్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందని వివరించారు. అనంతరం దేశభక్తి గీతాలు, మ్యాథ్స్ టిప్స్, ఆటలు, ఇంగ్లిష్ పద్యాలు, నీతి కథలు, పేపరు క్రాఫ్టింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సైన్స్ మ్యాజిక్ ప్రదర్శన శిక్షణ, నృత్యాలు, పాటలు ఉంటాయని, ఒంగోలు నుంచి ఇంద్రజాల ప్రదర్శకులు రామన్ హాజరవుతున్నారని నిర్వాహకులు కేవీ పిచ్చయ్య, ఈమని నాగేశ్వరరావు, ఆదినారాయణ తెలిపారు. సీహెచ్ వినోద్, దర్శి ఉపాధ్యాయురాలు నాగ స్రవంతి, ప్రజా నాట్యమండలి నాయకులు ఉప్పు మోహన్‌రావు, చిన్నారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం కావాలి


రైతులతో మాట్లాడుతున్న మానస

● కేవీకే నోడల్ అధికారి మానస

ముండ్లమూరు (కురిచేడు): ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధమయ్యే విధానాన్ని కేవీకే నోడల్ అధికారి టి.మానస వివరించారు. ముండ్లమూరు మండలం పోలవరం, శంకరాపురం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ప్రీ ఖరీఫ్ కార్యక్రమం ఆమె శుక్రవారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు రైతులు ఏ విధంగా శాస్త్రవేత్తల సలహాలతో సన్నద్ధమవ్వాలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభ్యున్నతికి చేయూతగా అందించే వివిధ రకాల పథకాల గురించి తెలిపారు. భూసార పరీక్షలను ఖరీఫ్ సాగుకు ముందే చేయించుకొని సాగుకు సన్నద్ధమవ్వాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యే రైతులు ముందుగా వారి పొలాలను లోదుక్కులు దున్నుకోవాలని, తద్వారా భూమి నుంచి ఆశించే వేరుకుళ్లు తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవచ్చని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలమురళీధర్ నాయక్ తెలిపారు. కలుపును కూడా సమర్థంగా అరికట్టవచ్చని తెలిపారు. వరిలో వచ్చే ఉల్లికోడు, మొక్కజొన్నలో వచ్చే కత్తెర పురుగు, కందిలో వచ్చే కాయ ఈగ, మారుక మచ్చల పురుగు నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు వివరించారు. పంట నమోదు, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే వివిధ పథకాల గురించి దర్శి ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. ఖాళీగా ఉన్న భూముల్లో ఫారెస్ట్ జాతికి లేదా ఉద్యానవన పంటలను సాగు చేసుకుంటే భూతాపం తగ్గి వర్షాలు సకాలంలో కురిసేందుకు దోహదపడతాయని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. భూమిలో సేంద్రియ కర్బనం పెరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఏయే పంటలు అనుకూలం, ఏయే పంటలను సాగు చేసుకోవాలి, వాటిలో యాజమాన్య పద్ధతులు ఎలా చేపట్టాలో ఉద్యానవన శాఖాధికారి డాక్టర్ ఎం.రవివెంకన్నబాబు తెలిపారు. ఏయే ఉద్యానవన పంటలకు సబ్సిడీ వస్తుంది, అవి ఎవరికి వర్తిస్తాయో తెలిపారు. రైతులకు వివిధ సీజన్‌ల్లో అవసరమైన రైతు శిక్షణ కార్యక్రమాలు అందజేస్తామని డీఆర్‌సీ ఏఓ వి.శేషమ్మ తెలిపారు. ఆయా అనుబంధ శాఖల అధికారులు ఈ కార్యక్రమం ద్వారా అందించే సేవలు రైతులకు వివరించారు. పోలవరం సర్పంచ్ లీలమ్మ, వీఏఏ, వివిధ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

దర్శి (కురిచేడు): పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్కరించాలని, సైడ్‌కాలువలు, వీధి లైట్లు, మంచినీటి వసతి, మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి.ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పోతవరం పంచాయతీ పరిధి తిమ్మాయిపాలెం ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్ హాజరై మాట్లాడారు. దళితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌరహక్కుల దినోత్సవానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ షాకీర్, వీఆర్వో సాయి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగుల సర్వే పరిశీలన


దివ్యాంగుల సర్వేను పరిశీలిస్తున్న ఎంఈఓలు

పెద్దారవీడు: గ్రామాల్లో దివ్యాంగుల సర్వేను సక్రమంగా చేయాలని ఎంఈఓ–1, 2లు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం సూచించారు. శుక్రవారం బద్వీడుచెర్లోపల్లిలో ఐఈఆర్టీలు నిర్వహిస్తున్న దివ్యాంగుల సర్వేను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ గ్రామాల్లో దివ్యాంగులను గుర్తించి పేర్లు నమోదు చేయాలని చెప్పారు. గ్రామాల్లో మాటలు, వినికిడి, మందబుద్ధి కలిగిన పిల్లలు ఉంటే ఐఈఆర్టీలను సంప్రదించాలని తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగులకు అవసరమైన సామగ్రిని సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో దివ్యాంగుల తల్లిదండ్రులు మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం ఐఈఆర్టీలు డి.బీబీ, బాలవర్ధన్‌రాజులను సంప్రదించాలని ఎంఈఓలు చెప్పారు.